క్లుప్తంగా

కనుల పండువగా ఆదిలక్ష్మి అమ్మవారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం నిత్యపూజలతోపాటు శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు మహా హారతి, మంత్ర పుష్పం జరిపారు. దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణలు చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు, ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ పర్యవేక్షించారు.

పలు ప్రశ్నలు లేవనెత్తుతున్న డీలిమిటేషన్ ప్రక్రియ

లక్ష్మీపురం : డీలిమిటేషన్ ప్రక్రియ పలు ప్రశ్నలను లేవనెత్తుతోందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన చర్చా కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు ఎ.వి.రామారావు మాట్లాడుతూ సంస్కృతులు, భాషలు, మతాలు కలిపిన మిశ్రమ దేశంగా కొనసాగుతున్న భారత దేశంలో కొద్దికాలంగా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వివక్ష పెరిగిపోతోందని తెలిపారు. రాజకీయ వర్గాల మధ్య అసమానతలతో సామాజిక శక్తి, సామరస్యాలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. పెన్షనర్స్ సంఘం నాయకులు ఎల్. మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పేయిలు డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలు బలహీనపడతాయనే ఉద్దేశంతో దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరిచి ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే అధిక శక్తి ఇచ్చే డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల రాజకీయ సమతుల్యతకు ముప్పు ఉందని హెచ్చరించారు. డీలిమిటేషన్ వల్ల బీజేపీకి లాభం సమకూరుతుందని, ఉత్తరాధి రాష్ట్రాలకు అధిక లోక్ సభ సీట్లు వస్తాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల వారు మాట్లాడడానికి ఇక బలం ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్.వి.సింగరయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నెహ్రూనగర్: కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కార్పెంటర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సున్నం మల్లికార్జున రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకాని రోడ్డులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జగనన్న తోడు, చేదోడు పథకాల ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు జరిగేవని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులను పట్టించుకున్న పాపన పోలేదని విమర్శించారు. ఆధునిక యంత్రాలు వాడుకలోకి రావడం ద్వారా చేతి వృత్తి దారులకు పనులు లేకుండా పోయాయని చెప్పారు. చేతివృత్తిదారుల బాధలను ప్రజల గొంతుగా వినిపించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ ఆర్టిసన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా తోలేటి శ్రీకాంత్‌ను నియమించడం అభినందనీయమని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు సూర్యనారాయణ, దాసు, రామకృష్ణచారి, నాగేశ్వరావు, రియాజ్ బాషా పాల్గొన్నారు.

టీడీపీ కార్పొరేటర్ భర్త హల్‌చల్



నెహ్రూనగర్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ, జనసేన కార్పొరేటర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇందుకు నిదర్శనంగా రెండు రోజుల కిందట 6వ వార్డు టీడీపీ కార్పొరేటర్ పోతురాజు సమత భర్త చంద్రశేఖర్ సదరు వార్డులో ఇంటి నిర్మాణం చేపడుతున్న వారి వద్దకు వెళ్లి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అన్ని అనుమతులు ఉన్నాయి.. డబ్బులు ఎందుకు ఇవ్వాలని ఎదురు తిరిగారు. అయినా పట్టుబట్టడంతో బాధితులు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను కలిసి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన కార్పొరేటర్ భర్త చంద్రశేఖర్‌ను మందలించినట్లు తెలిసింది. దీనిపై ఆగ్రహం చెందిన అతడు పూటుగా మద్యం తాగి నిర్మాణదారులతో వాగ్వివాదానికి దిగాడు. తన మీదే ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తారా ? అంటూ పరుష పదజాలంతో తీవ్రంగా దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఆటో, మోటారు సైకిల్ ఢీ

నగరంపాలెం: వేగంగా వస్తున్న మోటారు సైకిల్ ఆటోను ఢీకొంది. అనంతపురం జిల్లాకు చెందిన పలువురు శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో దిగారు. అక్కడ నుంచి గోరంట్లలో జరిగే గుడారాల పండుగకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ వైపుగా ఆటో, మోటారు సైకిల్ వెళ్తున్నాయి. ఆటోను అతిక్రమించి వెళ్లే సమయంలో మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు.

పురుషుల జీవితంలో మహిళల పాత్ర బహుముఖం



డాక్టర్ సరళాదేవిని సత్కరిస్తున్న లవీణారెడ్డి, వాణీ తదితరులు



డాక్టర్ అనితను సత్కరిస్తున్నహిందూ కళాశాల అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: పురుషుల జీవితంలో మహిళలు బహుముఖ పాత్రలు పోషిస్తున్నారని ప్రముఖ వైద్యురాలు టి. సరళాదేవి పేర్కొన్నారు. ఎస్వీఎన్ కాలనీలోని నారాయణ స్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సరళాదేవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని, పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలియజేశారు. ప్రతి వ్యక్తి జీవితంలో స్త్రీ పలు పాత్రలు పోషిస్తుందని తెలిపారు. మగవారికి సమానంగా టీచర్, ఇంజినీర్, పైలెట్ వంటి బాధ్యతలను స్వీకరించి నూరుశాతం న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ-ఛాంప్స్ ఆర్ అండ్ డీ పి. వాణీ చౌదరి మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక భారాన్ని సైతం మహిళలు మోస్తున్నారని, ఉన్నత శిఖరాలను చేరుకుని, పురుష శక్తికి తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ లవీణారెడ్డి మాట్లాడుతూ స్త్రీ తన హక్కులను, బాధ్యతలను, స్వేచ్ఛను స్వతంత్రంగా ప్రకటించుకోగలిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరీర్‌తో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: కెరీర్‌తో పాటు ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలని గుంటూరు కిమ్స్ ఆసుపత్రి సీనియర్ మహిళా వైద్య నిపుణురాలు డాక్టర్ నెలకుదుటి అనిత సూచించారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల మహిళా సాధికారిక విభాగం (ప్రమదావనం) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రాథమిక దశ నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ, జాగ్రత్త అవసరమని, తద్వారా చక్కటి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. నిద్రపోకుండా మొబైల్‌ఫోనును అతిగా వాడటం వల్ల హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటుందని చెప్పారు. చక్కటి ఆరోగ్యవంతమైన శరీరం కావాలంటే సరిపడా నిద్రపోవడం చాలా అవసరమని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో మహిళలు మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకమైన రోజు అవసరం లేని సమాజాన్ని నిర్మిద్దామని, మహిళలందరినీ సమానంగా చూడటం మన సంప్రదాయమని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళలను తల్లిగా, చెల్లిగా తోబుట్టువుగా చూసి గౌరవించే సమాజం మనదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి. వేణుగోపాల్, ప్రమదావనం కన్వీనర్ వి. బ్యూలారాణి, సభ్యులు గిరిజ, లక్ష్మమ్మ, సీహెచ్ అరుణ, మంజుశ్రీ, మాధవి, శాంతిలత, హసీనా, కోటేశ్వరమ్మ, శ్రీజ, రామలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభ్యుదయం

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు లింగ వివక్షను రూపుమాపినప్పుడే మహిళాభ్యుదయం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో ఉమెన్ అచీవర్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీడబ్ల్యూసీ మాజీ చైర్‌పర్సన్ సుగుణారాణి, సీనియర్ జర్నలిస్టు జి. చంద్రశేఖర్ పాల్గొన్నారు. సంస్థ చైర్‌పర్సన్ అనురాధ నాయుడు లక్ష్యాలను వివరించారు. అవార్డు గ్రహీతలను దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సంస్థ వ్యవస్థాపక సభ్యురాలు చందన, షేక్ అమీరున్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

ఉపాధ్యాయినులు నిర్దేశకులు కావాలి



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయినులతో డెమొక్రటిక్ పీఆర్టీయూ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయినులంతా విద్యార్థులకు చక్కటి పాఠ్యాంశాల బోధన ద్వారా సామాజిక ప్రగతి నిర్దేశకులుగా మారాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను తెలిపారు. శుక్రవారం కొత్తపేటలోని జలగం రామారావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో డీ-పీఆర్టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ బాధ్యతాయుతమైన కుటుంబ వ్యవస్థ ఏర్పాటు చేయడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఖాజావలీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజానికి దిక్సూచిలా పని చేస్తున్నారని ప్రశంసించారు. గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు జువ్వా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ సందర్భంగా గుంటూరు నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 100 మంది మహిళలకు పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినులను సత్కరించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కుమార్ రాజా. ఉపాధ్యాయులు నాగార్జున పాల్గొన్నారు.

కర్తవ్య నిర్వహణలో సమతుల్యత అవసరం



చైతన్యకుమారిని సత్కరిస్తున్న రాధాకృష్ణమూర్తి, జూపూడి రంగరాజు, మధుసూదనరావు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలంతా వృత్తి, వ్యక్తిగత జీవితంలో కర్తవ్యాలను నిర్వర్తించడంలో సమతుల్యత పాటించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్. చైతన్యకుమారి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చైతన్యకుమారి మాట్లాడుతూ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించినప్పుడే పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలరని తెలిపారు. గర్భాశయ కేన్సర్‌ను నివారించడంలో వ్యాక్సిన్ ప్రాముఖ్యతను డాక్టర్ నల్లపనేని శిల్ప వివరించారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ ఏ. ప్రత్యూష, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, మహిళా విభాగ సమన్వయకర్త జి. ఇందిరా ప్రియదర్శిని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి



అవగాహన సంస్థ కార్యాలయంలో మాట్లాడుతున్న సభ్యులు

లక్ష్మీపురం: రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని రచయిత్రి విజయశ్రీ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'మాట - పాట' కార్యక్రమం నిర్వహించారు. రచయిత్రి విజయశ్రీ మాట్లాడుతూ మహిళల శక్తి, సామర్థ్యాలను అన్ని రంగాల్లో సమాన ప్రాతినిధ్యంతో ఉపయోగించుకోగలిగిన నాడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాజ్యాంగంలోని 14, 15 అధికరణలు పురుషులతోపాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పటికీ ఆచరణలో సాధ్యపడడం లేదని పేర్కొన్నారు. కవయిత్రి వై.పద్మావతి మాట్లాడుతూ నేటికీ మహిళలపై గృహింస, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, వీటన్నింటిని ఎదుర్కొవడానికి పోరాటాలు చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, విశ్రాంత ప్రిన్సిపాల్ సీహెచ్.సుశీల, మహిళ నాయకురాలు మాధవి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ సమేత మహా కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ఏడో రోజుకు చేరాయి. శ్రీ పద్మావతి శ్రీ గోదాదేవి శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిపారు. టీటీడీ ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో కుంభారాధన, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచన, ఉక్త హోమం, విశేష హోమాలు నిర్వహించారు. విశ్వ గురు పీఠాధిపతులు శ్రీ విశ్వంజీ మహరాజ్, ఉత్తర కాశీ శ్రీసూర్య భాస్కరేంద్ర సరస్వతీ స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, మాదల రత్న గిరిబాబు, కొర్రపాటి రామారావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఎన్నికల హామీలను మరచిన కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

లక్ష్మీపురం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో రంగ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం నగర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్, జీజీహెచ్ స్టాండ్ శాఖ మహాసభను నగర అధ్యక్షుడు కూరాకుల రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఆటో రంగా కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా, వాటి గురించి కనీసం ప్రస్తావన కూడా చేయకుండా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అత్యంత దారుణమని ఖండించారు. నగర గౌరవ అధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగ శ్రీనివాస రావు, ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం నూతన నాయకత్వ ఎన్నికలో యూనియన్ అధ్యక్షులుగా శివ, కార్యదర్శిగా యూసఫ్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

సాంకేతికతతో కొత్త పుంతలు తొక్కుతున్న ప్రపంచం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న చిన్నం సుబ్బారావు, వజ్రాల నర్సిరెడ్డి, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన సాంకేతిక ఆవిష్కరణలతో ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతోందని హిందూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నం సుబ్బారావు అన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన టెక్నికల్ ఫెస్ట్ 'ఇన్నోవేషన్ ఫెయిర్-2025' శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం సాంకేతికత ఆవిష్కరణల ద్వారా కృత్రిమ మేధస్సు నుంచి ఆటోమేషన్ వరకు, ఐటీ నుంచి రోబోటిక్స్ వరకు వేగవంతంగా పురోగతి చెందుతోందని తెలిపారు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అంతా ఆవిష్కరణలు చేయడానికి ధైర్యం చేసే వారిదేనని, విద్యార్థులు ఆ దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ఫెస్ట్ కన్వీనర్ సూదా కృష్ణార్జునరావు మాట్లాడుతూ 14 అంశాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.మధుసూదనరావు, విభాగాధిపతులు ఐ.నాగాంజనేయులు, వి. రమాదేవి, కె.సుస్మిత, పి.స్నేహలత, కోఆర్డినేటర్ బి.సందీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ తెలిపారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవ కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా జీతాలు, ఐదు నెలలుగా పెండింగ్ బిల్లులు రాకపోతే ఏ విధంగా పథకాన్ని నిర్వహించాలని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్ బకాయిలు, బిల్లులు చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు జీతాలు పెంచాలని, తక్షణమే గ్యాస్ సిలిండర్లు మంజూరు చేయాలని, యూనిఫామ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుందని లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షమి, లక్ష్మి, ఆదిలక్ష్మి, పార్వతి, రాజు పాల్గొన్నారు

బొంగరాల బీడు డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం



మురుగు నీటిని తరలింపును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని బొంగరాలబీడులో డ్రెయిన్ బ్లాక్ అయి మురుగునీరు రోడ్లు, ఇళ్లల్లోకి వచ్చిందని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన శుక్రవారం బొంగరాల బీడు నుంచి మురుగు వెళ్లే అవుట్ ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించారు. బుచ్చయ్యతోట, రామిరెడ్డి నగర్, శ్రీనివాసరావుతోట, నల్లపాడు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గురువారం రాత్రి నుంచి డీఈఈ కల్యాణరావు ఆధ్వర్యంలో బుచ్చయ్యతోట వైపు నుంచి యంత్రాల ద్వారా డ్రెయిన్ బ్లాక్ తొలగింపు చేపట్టినట్లు చెప్పారు. డ్రెయిన్ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయిందన్నారు. డ్రెయిన్‌లో ప్లాస్టిక్ కవర్లను వేయవద్దని ఆయన నగర ప్రజలకు సూచించారు. అనంతరం రామిరెడ్డినగర్, శ్రీనివాసరావుతోటల్లోని హిందూ శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో టాయ్‌లెట్స్ నిర్మాణం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, డీఈఈలు కళ్యాణరావు, మధుసూదన్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులకు సూచించారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో శనివారం జరగనున్న వేడుకల ఏర్పాట్లను ఆయన డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా సరఫరా అధికారి కోమలి పద్మ, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు. శాఖల వారీగా కలెక్టర్ కేటాయించిన విధుల మేరకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

2024-25 సంవత్సరానికి ఆస్తి పన్ను పన్ను చెల్లింపుదార్లకు వీలుగా రెండవ శనివారం, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.నగర ప్రజలంతా పన్నులు చెల్లించి, నగరాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

రేపు సెల్ఫ్ డిఫెన్స్, కల్చరల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): భారత్ రక్షా మంచ్ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్, కల్చరల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నారని ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు రూరల్ పొత్తూరులో ఆక్మే ఇంటర్నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్, కర్రసాము (సిలంబమ్), కలరియా పట్టు, కరాటే, తైక్వాండో, కోలాటం, భరతనాట్యం, కూచిపూడి, చెక్క భజన, డంబెల్స్ తదితర విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. వివరాలకు 70755 08842 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, పురపాలక, నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలను శని, ఆదివారాల్లో కూడా స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో శనివారంతో పాటు ఆదివారం సైతం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాల్టీల్లో పని చేస్తున్న ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్ల స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులకు సంబంధించిన కామన్ సీనియార్టీ జాబితాను డీఈవోజీఎస్‌టీ.బ్లాగ్‌స్పాట్.ఇన్‌లో ఉంచినట్లు డీఈవో రేణుక తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈనెల 10వ తేదీ సాయంత్రంలోపు లిఖిత పూర్వకంగా కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ బాలాజీ నగర్ ఫీడర్‌లో లైన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రగతీనగర్, లక్ష్మీనగర్, యాదవుల బజార్, పాముల కాలనీ ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేయనున్నట్లు టీ-4 డీఈఈ పీహెచ్. ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

- రవీంద్ర నగర్ సబ్‌స్టేషన్ ఏరియా, శ్యామలానగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్యామలానగర్, పట్టాభీపురం, రవీంద్ర నగర్, శ్రీనగర్, స్తంభాలగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డీఈఈ ఎస్. గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
- 11 కేవీ ఈపీఎఫ్ ఆఫీసు ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కృష్ణనగర్ 2వ లైన్ నుంచి 5వ లైన్ వరకు ఉండే ఏరియాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డీఈఈ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ఎస్‌హెచ్‌ఓలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌ఓ మీటింగ్ హాల్లో మహిళలకు ఉచిత వైద్య శిబిరం - ఆరోగ్య పరిరక్షణ చర్యలపై శాస్త్రీయ అవగాహన సభ నిర్వహిస్తున్నట్టు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించే ఈ వైద్య శిబిరం ఆదివారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో డాక్టర్ డి.పద్మజ సేవలందిస్తారని తెలిపారు. మహిళలకు ఈనెల 31 వరకు అతి తక్కువ ఖర్చుకే హార్మోన్స్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు రూ. 1250కే 86 పరీక్షల కంప్లీట్ హెల్త్ చెకప్ నిర్వహిస్తామని వివరించారు. నగర మహిళలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.





